
# స్టేటస్ సింబల్

అల్లూరి గౌరీలక్ష్మి



కొడవటిగంటి కుటుంబరావు కథా సంపుటి చదవడం పూర్తిచేసి లైబ్రరీకి తిరిగి ఇవ్వబుద్ధి కాక మళ్లీ చదువుతూ కూర్చున్నాను. కారు హార్న్ పదే పదే ఇంటిముందు నుంచి వినబడడంతో పుస్తకం మూసేసి తొంగిచూశాను, పెద్దమ్మ కాదుకదా? అని అనుమానంతో. నిజమే, పెద్దమ్మే! పరిగెత్తుకుంటూ వెళ్లి తలుపు తీశాను.

కారు దిగుతూనే ఆయాసపడుతూ పెద్దమ్మ సోఫాలో కూలబడింది. మంచినీళ్లు తెచ్చిచ్చాను. అవి తాగి కాస్త తేరుకుంది. "పొద్దున్నే బయలుదేరామే, శశీ! కాస్త వంట చేసి భోజనం పెట్టమ్మా? నీరసమొస్తోంది, ముందు కాస్త కాఫీ ఇద్దూ! డ్రైవర్‌కి కూడా ఇవ్వాలమ్మా!" అంది.

"అలాగే పెద్దమ్మా! ఎంత...? అరగంటలో చేసేస్తాను!" అంటూ చకచకా ఇద్దరికీ కాఫీ ఇచ్చి వంట మొదలుపెట్టాను. కాఫీ తాగాక పెద్దమ్మని బెడ్రూమ్‌లోకి తీసుకెళ్లి పడుకోమన్నాను. "ఊరికే, చిన్న కునుకు వేస్తాను!" అంటూ మంచంపై వాలింది.

వంట చేసేసి పెద్దమ్మని లేపి వడ్డించాను. తిన్నాక సోఫాలో కూర్చుంది. డ్రైవర్‌కి కూడా భోజనం పెట్టి, పెద్దమ్మ దగ్గరికి వచ్చి కూర్చున్నాను. "ఏంటి, పెద్దమ్మా, నా మీద ఇంత దయ కలిగింది?" అన్నాను ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుంటూ.

"బాబాగారి ఆశ్రమంలో ఏవో ఉత్సవాలు చేస్తున్నారట. ఒక వారం రోజులు ఉందామని వెళ్తున్నానే!"

"మరి, పెదనాన్న?"

"రానన్నారు. నేనేం చెయ్యను? అందుకే నే నొక్కదాన్నీ బయలుదేరాను!" అంటూ మాటల్లో పడింది పెద్దమ్మ. ఇంతలో లంచ్‌కి పిల్లలొచ్చారు. వాళ్లు తిని ఆటలకు వెళ్లాక టీ తాగి పెద్దమ్మ, నేను మళ్లీ కబుర్లలో పడ్డాం. అప్పుడు చెప్పింది పెద్దమ్మ మనసులో మాట.

"మా మావగారికి కాన్సరే, శశీ! నాలుగు నెలల కంటే బతకరట. కొడుకు దగ్గరుండాలని ఇక్కడికి చేరారు. ఎవరు చేస్తారే ఆయనకి? ఎంత పనివాళ్లున్నా మనకి బాధ్యత తప్పదు కదా! అయినా నేనెందుకు చెయ్యాలి చెప్పు, ఆ ముసలాయనకి? నా వల్ల కాదని చెప్పేశాను. కడుపున పుట్టినందుకు మీరు కావాలంటే చేసుకోండన్నాను మీ పెదనాన్నని.

"అసలా ముసలాయన ఈ సిటీలో ఎందుకు చెప్పు? ఊరిలోనే ఉండి ఒక మనిషిని పెట్టుకుంటే సరిపోదా! ఏదో ఒక డాక్టర్‌ని చూడమంటే సరిపోతుంది కదా! అంటే వినిపించుకోరు మీ పెదనాన్న. ఆ పెద్దాయన్ని కనిపెట్టి ఉండటానికి నాకు మాత్రం ఓపికుందా శశీ? పిల్లలిద్దరూ చదువు పూర్తి చేసుకుని అమెరికా వెళ్లిపోయారు. ఇప్పుడు నే నీ మావగారికి సేవలు చేస్తూ కూర్చోవాలా? నా వల్ల కాదే! అందుకే ఇలా వచ్చేశానే!"

పెద్దమ్మ కథనం విన్న తర్వాత ఆ ముసలాయన మీద నాకు జాలి కలిగింది. పాపం, పెద్దాయన. కొడుకు, మనవలు ఎంత వృద్ధిలోకి వస్తే మాత్రమేమిటి? ఆఖరి దశలో ప్రేమగా ఒక ముద్ద పెట్టే వాళ్లు లేకపోయాక.

నా భావం నా కళ్లల్లో ప్రతిఫలించిందో ఏమో, కాస్త పెద్దమ్మ సర్దుకోవడం మొదలుపెట్టింది, విశ్లేషణ మార్చి.

"చూడకూడదని కాదే, శశీ! నా ఆరోగ్యం సంగతి చూసుకోవాలి కదా! పిల్లలిద్దరూ ప్రతి వారం అమెరికా నుంచి ఫోన్లు చేస్తూంటారు 'హైరాన పడకు మమ్మీ! అన్నీ నీ నెత్తినేసుకోకు మమ్మీ, మా మీద ఒట్టే నువ్వు కష్టపడితే!' అంటారే! నాకు కాస్త సుస్తీ చేసిందని తెలిసిందంటే వాళ్లు బెంగపెట్టేసుకుంటారే! మొన్నీమధ్య ఏమైందనుకున్నావ్? చచ్చిపోతా ననుకున్నా ననుకో! అంత జబ్బు చేసింది. రెండురోజులు ఒకటేజ్వరం, ఒళ్లు నొప్పులు. అలా చచ్చి బతికాననుకో! నీకు కబురు చేద్దామనుకున్నాను!" అంటూ కళ్ల నీళ్లు పెట్టుకుంది పెద్దమ్మ.

నాకు జాలేసింది పెద్దమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంటుంటే. "మరి అంత ఓపిక లేనిదానివి ఆశ్రమానికి ఎందుకు బయలుదేరావు, పెద్దమ్మా? అక్కడ నీకు అన్నీ సమయానికి అమరుతాయా?" పెద్దమ్మ జుట్టు సర్దుతూ ఆప్యాయంగా అడిగాను.

"డబ్బులు పారేస్తే ఎక్కడున్నా అన్నీ జరుగుతాయి. అయినా, మేం ఆశ్రమం పక్కన ఒక ఫ్లాట్ కొన్నాం కదా నాలుగు లక్షలు పోసి. అందులో ఉంటాను. అక్కడ కూడా గది ఏసీ చేయించాం. బాబాగారి స్పీచ్ సమయానికి వెళ్లి వస్తూంటాను. నువ్వు కూడా రాకూడదూ చక్కగా, పిల్లల్ని తీసుకుని?" అంది.

"అయ్యో, పెద్దమ్మా? ఇప్పుడు వేసవి సెలవులు కదా! మా ఆడపడుచు



అసహనం లేదు. ప్రశాంతత కనబడుతోంది.

"శశీ! నువ్వు రమ్మంటే రాలేదు కానీ, ఆ బాబాగారి ప్రసంగాలు విని తీరాలనుకో! జన్మధన్యమవుతుందే! ఎందుకొచ్చిన సంసార జంఝాటంలే! ఆ భగవంతుని అనుగ్రహంకోసం పాకులాడాలి. ఆ స్వామి ప్రసంగం వింటూంటే ఒళ్లు గగుర్పొడిచి ఆనందం ఉప్పొంగుతుందనుకో! కళ్లవెంబడి నీళ్లు జలజలా కారిపోతాయి. పిల్లల మీద మమకారం, సంసారం మీద యావ వదిలిపోయినట్టయిపోతుందనుకో!"

"అయితే అన్నీ వదిలేసుకుని వచ్చావన్నమాట!"

"ఏమిటో, వింటున్నంత సేపూ వైరాగ్యం కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. కొంతసేపటికి మళ్లీ మాయ కమ్మేసి అన్ని బంధాలూ చుట్టేసుకుంటాయి. అది భగవంతుని నిర్ణయం తప్ప మన చేతిలో ఏమీ ఉండదే!"

"అయితే, కనీసం వారం రోజులు సన్యాసినివి అయ్యానంటావ్, భవబంధాలు తెంచుకుని!"

"ఏం కాదులే, అక్కడనుండే పిల్లలిద్దరికీ



వస్తానంది పిల్లల్ని తీసుకుని. అందుకే నేను అమ్మ దగ్గరికి కూడా వెళ్లలేదు. దసరాకి వెళ్దాంలే అని ఊరుకున్నాను."

"ఓసి నీ అమాయకం కూలా? అడపడుచు ఇప్పుడు రావడమేంటే ఖర్మ, నిన్ను పుట్టింటికి పోకుండా చేసింది!" విసుగ్గా అంది.

"పోన్లే, పెద్దమ్మా? మా అత్తగారు పోయారుకదా! ఇంకెక్కడికి వెళ్తుంది? మావగారు ముందే లేరు. ఉన్నది ఈ అన్నగారు ఒక్కరే కదా పాపం, అందుకే వస్తోంది!"

"నిన్ను పిచ్చిదాన్ని చేసి ఆడిస్తారే అందరూనూ! కాస్త తెలివితేటలతో మసలుకుని బాధలు తప్పించుకోవు కదా! ఆ పిచ్చిపిచ్చి సాహిత్యం పుస్తకాలు చదివి మంచీ, మానవత్వం అంటూ అమాయకపు కబుర్లు చెబుతావ్!" అని చిరాకు పడుతూ బయలుదేరింది పెద్దమ్మ

ooo

ఊరినుంచి ఆడపడుచు, పిల్లలూ దిగారు. ఇల్లంతా సందడిగా ఉంది. ఎన్ని కబుర్లు, విశేషాలు చెప్పుకున్నా సరిపోవడంలేదు నాకూ, మా ఆడపడుచుకీ. తర్వాత సినిమాల గురించీ, టి.వి. సీరియల్స్ గురించీ సోది పెట్టాం. మధ్యమధ్యలో షాపింగ్‌లతో బిజీగా ఉంటున్నాం.


వారం తర్వాత తిరిగి వస్తూ మళ్లీ దిగింది పెద్దమ్మ. ఆమె కన్నులలో ఇదివరకటి

## అందుకేనేమో...

"నేను సినిమా ఆర్టిస్టు నవుతానని ఎప్పుడూ అనుకోలేదుకాని, అయ్యాను. ఇప్పుడు నాకు ఇదే సర్వస్వం. మనం చేసేది ఏ వృత్తయినా దానిని ప్రేమించాలనేదే నా సిద్ధాంతం" అన్నారు వెంకటేష్.

'ఇంతకీ మీరు ఆటలు బాగా ఆడతారా?' అంటే, "చిన్నప్పటినుండీ స్పోర్ట్స్ అంటే బాగా ఇష్టం. టైం దొరికితే చాలు...ప్లేగ్రౌండ్‌లోనే తిష్ఠ వేసేవాణ్ణి. క్రికెట్ అంటే చెప్పలేనంత ఇష్టం" అన్నారు. అందుకేనేమో వెంకీ ఏ విషయాన్నైనా స్పోర్టివ్‌గానే తీసుకోగలుగుతున్నారు. 'టెన్షన్ పడడం నాకు నచ్చనిపని' అంటారీయన.

వల్లి



అమెరికా ఫోన్లు కొట్టాను. ఇవాళ వస్తున్నానని మీ పెదనాన్నకి ఫోన్ కూడా చేశాను. మా మావగారు ఊరికి వెళ్లిపోయారట!" అంది ఆపద నుంచి తప్పించుకున్నంత ఆనందంగా.

"అంతా బాబా దయ! లేకపోతే ఇక్కడ మా నా నెత్తిన కూర్చుందామని ఆ ముసలాయన ప్లాన్ వేసుకుంటాడా? ఒక్క కొడుకయితే మాత్రం, మా ప్రాణాలు తియ్యాలా? ఆ ఇబ్బందులన్నీ నేనెందుకు పడతానే?" మావగారు వెళ్లిపోయారన్న సంతోషం ఆమె కళ్లలో కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

"మరి పెదనాన్నకి నీ మీద కోపం వచ్చిందేమో పెద్దమ్మా?" కాస్త ఆలోచించి అన్నాను.

"ఆఁ, ఏడిశారు! నా మీద కోపగించుకోవడానికి ఆయనకెన్ని గుండెల్లే! మనసులో ఏమున్నా ఉన్నాగానీ, పైకనేంత ధైర్యం ఉండదులే!" అంది చిరునవ్వుతో.

సాయంత్రం ప్రయాణమయింది పెద్దమ్మ.

"నాలుగు రోజులుండరాదా సరదాగా?" అన్నాను.

"నీ ఆడబిడ్డ, పిల్లలూ ... ఈ గోలలో నేనుండలేనే తల్లీ! మళ్లీ ఎప్పుడన్నా వస్తాలే!" అంటూ వెళ్లిపోయింది.

బాబాగారి ఆశ్రమం పెద్దమ్మకి ఇలా ఉపయోగపడిందన్నమాట. మరి అక్కడ బాబా ఇచ్చే ఉపదేశాలు వీళ్ల నెంతవరకు మారుస్తున్నాయి? బాధ్యతల నుండి తప్పించుకుని సుఖపడమని ప్రోత్సహిస్తున్నాయా?'

నాక్కాస్త కోపం వచ్చింది బాబాగారిమీద. పెద్దమ్మ ఇచ్చి పోయిన ప్రసంగం కాసెట్ పెట్టి, వినడానికి కూర్చున్నాను.

బాబా స్వరం ప్రశాంత గంభీరంగా సాగుతోంది. "సత్యము తెలిసి యుండియూ అసత్యమార్గంలో ప్రవేశిస్తే సత్యస్వరూపం కనుమరుగవుతుంది. భగవంతుని నిరంతరం జ్ఞాపకం చేసుకుంటే మన అహంకారం తగ్గుతుంది. జ్ఞానము వెలుతురు వంటిది. అది ఉన్న చోట శోక మోహాదులు చేరవు. పరుష వచనములు పలుకరాదు. తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవాలి. ఎదుటివారి కష్టనష్టములను సానుభూతితో, సహనంతో గుర్తించాలి. మానవ సేవే మాధవ సేవ!"

బాబా ప్రసంగం అంతా ఇలాగే తండ్రి ప్రేమలోని ఆప్యాయతతో ఎంతో పరిశుద్ధంగా వినబడుతోంది. మనసుకు ఎంతో హాయిని కలిగిస్తోంది. మానవత్వాన్ని తట్టి లేపుతోంది.

'పెద్దమ్మ ఎత్తులూ, జిత్తులూ ఏమీ లేవే ఇందులో! అంటే పెద్దమ్మ ఈ వచనాలన్నీ సంగీత కచేరీలా విని ఆనందిస్తోందన్న మాట! ఆచరణ మాత్రం శూన్యమన్న మాట. మరి అలాంటప్పుడు పెద్దమ్మలాంటివాళ్లు ఎందుకు ఆకర్షింపబడుతూంటారు? విన్నవన్నీ వాళ్లకు తగ్గట్టుగా అన్వయించుకుంటారేమో!'

సెలవులయ్యాయి. మళ్లీ స్కూళ్లు తెరిచారు. ఆడపడుచు వెళ్లిపోయింది. పిన్ని పెద్దకూతురి పెళ్లి. అది అమెరికాలో డాక్టరు. పెళ్లి కొడుకు కూడా అక్కడ డాక్టరే! చిన్నాన్న కాంట్రాక్టులు చేసి బాగా సంపాదించాడు. యాభై లక్షలు కట్నమిచ్చి పెళ్లి చేస్తున్నాడు. చిన్న కూతురు ఇంజనీరింగ్ చదువుతోంది.

పెద్దమ్మ కారులో వచ్చింది పెదనాన్నతో కలిసి. మా ఫామిలీ కూడా అదే కారులో ఎక్కి చిన్నాన్న, పిన్నిల ఇంటికి చేరాం. పెళ్లికి ఏర్పాట్లు చాలా వైభవంగా జరిగాయి. చుట్టాలంతా రెండురోజులు ముందే వచ్చేశారు. ఆడవాళ్లందరికీ వెయ్యేసి రూపాయల చీరలు తెచ్చారు.

పిన్ని ఆడపడుచు కూడా వచ్చింది. ఆమె ఎక్కడో పల్లెటూర్లో ఉంటుంది. మధ్యతరగతి కుటుంబీకురాలు. భర్త వ్యవసాయం చేసుకునే చిన్న రైతట. భర్తనీ, పిల్లల్నీ తీసుకురాకుండా ఒక్కతే వచ్చింది. వంట ఇంటికి ఇన్‌ఛార్జ్‌గా ఉండి చకచకా పనులు చేయించడం మొదలుపెట్టింది.

అన్న కూతురి పెళ్లికి వెళ్లకపోతే బాగుండదని, ఆ పల్లెటూళ్లో ఏమన్నా అనుకుంటారని వచ్చినట్టుంది. మామధ్య తిరగడానికి మనస్కరించక వంటింట్లో అన్నీ చక్కబెడుతూ ఉండిపోయినట్టనిపించింది. మా ఊరి నుంచి అమ్మా, నాన్న కూడావచ్చారు.

పెళ్లి రాత్రికి. హడావుడి ఇంకా ఎక్కువయింది. నాక్కూడా చాలా పనులు పెట్టారు. అటూ ఇటూ పరుగులు తీస్తున్నాను. బీరువా తాళాలు నాకిచ్చారు. ఎవరికి ఏం కావాలన్నా నేను తీసి ఇస్తున్నాను బీరువాలోంచి డబ్బు, వస్తువులు వగైరా!

చిన్నాన్న నన్ను రహస్యంగా పిలిచి పిన్నిని గదిలోకి తీసుకురమ్మన్నాడు. నేను పిన్నిని వెతికి పట్టుకొచ్చాను. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూంటే నేను బీరువాలో సొమ్ము అకౌంట్ చూసుకుంటున్నాను.

"మా అమ్మ పెళ్లి చూడాలంటున్నదే!" చిన్నాన్న అభ్యర్థనగా అంటున్నాడు.

"ఏమిటి చూసేదీ? అక్కడంతా పెద్దపెద్ద ఆఫీసర్లూ, కోటీశ్వరులూ పెళ్లికి వస్తున్నారు. ఈ ముసలమ్మ తగుదునమ్మా అని తలమీద కొంగు వేసుకుని ఎదురుగా కూర్చుంటుందటనా? ఏం అక్కర్లేదు!" కఠినంగా అంటోంది పిన్ని.

"అది కాదే! అమ్మ అందరితోనూ చెబుతోందట 'నన్ను పెళ్లికి రావద్దన్నారు, వాళ్ల హోదాకి నేను భంగమవుతానా?' అని వలవల ఏడుస్తోందట."

"చూశారా, ఆవిడ దుర్బుద్ధి! రావద్దని అన్నానే అనుకోండి. ఆ మాట తల్లిలా కడుపులో పెట్టుకోక అందరికీ చెపుతుందా? పోనీ, పెద్దది కదా అని ఆవిడకు కొత్త చీరా, సారె పంపుదామనుకున్నాను. ఇంక వచ్చినా పంపను! ఆ ముసలావిడకి మనం బాగున్నామని కడుపు మంట! కూతురికి కలగలేదని ఏడుపు! దరిద్రుల్ని ఎవరూ బాగుచెయ్యలేరు, అదృష్టవంతుల్ని ఎవరూ చెరపలేరు!"

సంభాషణ ఇలా సగం నడిచిన టైములో పిన్ని ఆడపడుచు ఆ పక్కకి వచ్చింది. ఆమెను రావద్దని చెప్పడానికి సభ్యత అడ్డం వచ్చి ఏమీ అనలేకపోయాను.

పిన్ని మాటలు విన్న ఆమె గుడ్లనీరు కుక్కుకుంటూ వెళ్లిపోయింది. నా మనసు చివుక్కుమంది. 'పెళ్లనేది పైకి శుభకార్యమైనా లోపల ఎన్ని ఏడుపులుంటాయో?' నిట్టూర్చాను.

పిన్ని రుసరుసలాడుతూ వెళ్లిపోయింది. చిన్నాన్న బేల మొహం వేసుకుని మంచంపై కూర్చున్నాడు. చిన్నాన్న చేతకానితనం మీద కోపమూ, పిన్ని గయ్యాళితనం మీద అసహ్యమూ కలిగాయి.

పిన్ని అత్తగారిని తల్చుకోగానే జాలి కలిగింది. పాపం, ఆవిడకి కొడుకు కూతురే కదా? పెళ్లి చూడాలనుండటం సహజమే! కొడుకు ధనవంతుడైనా తల్లి బీదదే కాబట్టి ఆమెకి పెళ్లి చూసే అర్హత లేదేమో! కుల విభేదాలకంటే వర్గ విభేదాలు చిన్నవి కావు అంటారిందుకేనేమో!



పెళ్లికి ముందు బ్రహ్మాండమైన మ్యూజికల్ పార్టీ ఏర్పాటు చేశారు. పెళ్లి జనమంతా చక్కగా కూర్చుని ఆనందించారు. పెళ్లి చాలా అట్టహాసంగా జరిగింది. బాణసంచాతో చుట్టుపక్కలంతా మార్మోగిపోయింది. వంటలు అద్భుతంగా చేశారు. ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ సలాడ్‌లు విరజిమ్మినట్లు తిన్నారు. ఈ రాత్రి ఏర్పాట్లకే మూడు లక్షలయిందని మావారు చెవిలో ఊది పోయారు. 'నిజమే, ఇంత జనం వచ్చారు, అయి ఉండాలి' అనుకున్నాను.

మర్నాడు మా పిన్ని పట్టుబట్టి షిర్డీ సాయిబాబా భజన చేయించింది. భజన బృందం చాలా చక్కని పాటలు శ్రావ్యంగా పాడారు. భజన చేశారు. పెద్దవాళ్లంతా భజనలో పాల్గొని దాన్ని జయప్రదం చేశారు. అందరికీ ఎంతో హాయిగా తోచింది భగవంతుని ప్రార్థించడం. అమ్మ సంతోషానికి అవధుల్లేవు. నాన్న కూడా సంతోషించారు.

దూరపు బంధువులంతా మర్నాడే బయలుదేరారు. అందరికీ చీరా, బొట్టూ ఇచ్చే కార్యక్రమానికి నన్ను పురమాయించింది పిన్ని. పిన్ని ఆడపడుచు కూడా ప్రయాణమైంది. పిన్ని ఆమెకు చీర ఇచ్చింది బొట్టు పెట్టి. "వద్దు, వదినా!" అని అభిమానపడుతోందామె మొహం చిన్నది చేసుకుని. ఆమె మొహం చూస్తే నాకు పాపం... అనిపించింది. ఆడపడుచు దర్పం లేకపోగా కించపడుతోంది. కానీ అదే మొహం చూసి పిన్ని అరికాలి మంట నెత్తికెక్కినట్లు మండిపడుతోంది.

"అంటే ...నన్ను ఉన్న ఒక్క ఆడపడుచుకీ చీర కూడా పెట్టని గయ్యాళిని చెయ్యాలన్నమాట మీ తల్లీ కూతుళ్ల పన్నాగం! అక్కడావిడేమో 'ఒంగిపోయున్నారు, పెళ్లికి ఏం వస్తారులెండి!' అన్నందుకు పెళ్లికి రావద్దన్నానని ఊరూ వాడా యాగీ చేస్తోంది. ఇక్కడ నువ్వు పెళ్లికొచ్చి చీర ఇస్తే వద్దని నన్నల్లరి చేస్తున్నావన్న మాట!" కసిగా అంటోంది పిన్ని నిప్పులు కక్కుతూ. వరుసగా బాణాలు తగులుతున్న పక్షిలా బాధతో వణికిపోయింది పిన్ని ఆడపడుచు. "అయ్యో, వదినా! నా ఉద్దేశం అదికాదు, వదినా?" అంది దుఃఖంతో గొంతు పూడుకుపోగా.

"బుద్ధిగా ఈ చీరా, సారె తీసుకో! మీ అమ్మకు కూడా ఆ చీరా, స్వీట్లూ ఇయ్యి. ఎక్కువ తక్కువ మాట్లాడొద్దని చెప్పు మీ అమ్మకు! తోడబుట్టిన వాడు పచ్చగా ఉన్నాడని సంతోషపడటం నేర్చుకో!" అంటూ ఇవ్వమని నాకు సైగ చేసి వెళ్లిపోయింది పిన్ని ఏడుస్తున్న ఆడపడుచు వైపు చూడకుండా.

నేను ఏడుస్తున్న ఆమె దగ్గరికి పోయి భుజంపై చెయ్యి వేశాను. ఆమె అభిమానపడి, కళ్లు తుడుచుకుని నా వైపు చూసింది. "అత్తయ్యా! మనుషుల నైజం తెలుసు కదా? బాధపడి ప్రయోజనం ఏమిటి చెప్పండి!" అన్నాను అనునయంగా.

ఆమె వడివడిగా వెళ్లిపోయింది. నేను చీరలు, స్వీట్స్ తీసుకుని ఆమె వెనకే వెళ్లి ఆమె పెట్టెలో పెట్టి వచ్చాను. 'అన్ని మాటలు అని ఇచ్చాక ఆ చీర ఆమె కట్టుకోగలదా?' అనిపించింది నాకు. ఆమె ఆ రోజే వెళ్లిపోయింది.

మర్నాడు మేమంతా తిరిగి బయలుదేరాం. పెద్దమ్మ, అమ్మ, నాన్న ఇంకో నాలుగు రోజులుంటామన్నారు. పిన్నీ, చిన్నాన్న మమ్మల్ని ఆప్యాయంగా సాగనంపారు. మేము ట్రైన్‌కి బయలుదేరాం. ట్రైన్‌లో కూర్చున్నాక పెళ్లి విశేషాలు సమీక్షించాం. తనకు తెలిసినంతవరకూ ఇంత ఖర్చుతో ఎవరూ పెళ్లి చేయలేదని మావారు అభినందిస్తున్నారు.

## చేతులు కాలాక...

నిర్మాతగా రెండు సినిమాలు తీసి చేతులు కాల్చుకున్న చక్రవర్తి ఇప్పుడు ఆకులు పట్టుకునే దశలో ఉన్నాడు. ఇప్పట్లో మళ్లీ నిర్మాణరంగంవైపుకి వెళ్లేదిలేదని చెపుతున్నాడు. డబ్బులు పోయాయన్న బాధతో కాబోలు "డబ్బు చాలా చెడ్డదని, అది అశాశ్వతమని చాలామంది అంటూంటారు. అది నిజం కాదు. నూటికి 99 అవసరాలు డబ్బుతోనే ముడిపడి ఉంటాయి. ఇది తెలుసుకునే చాలామంది స్వామీజీలు కమర్షియల్ అయిపోయారు. డబ్బు చాలా గొప్పది. దాని విలువ అదిపోయాకే బాగా తెలుస్తుంది" అంటున్నాడు.

చేతులు కాలినా ఫర్వాలేదు అనిపించేస్థాయి కొచ్చాకే మళ్లీ నిర్మాతగా కనిపిస్తాడట.

## హైకూలు

పరిమళం వీడింది
భరించలేక పువ్వు
నేల రాలింది

బాల్యం సీతాకోక
కాళ్లకు రాళ్లయి
పుస్తకాలు

అలల ఊయల్లోని
పడవ పసిపాపకు
ఏటిగాలుల జోల

శైశవఫలం
తీపి జాస్తి
త్వరగా పూర్తి

చేలబాలలకు
చనుబాలిస్తూ
నదీమతల్లి

సూర్యుడు
తూర్పు పడమరలాడుకొనే
ఫుట్ బాల్

మన బాల్యాన్ని
పెంచుతూ
తన బాల్యాన్ని కోల్పోతూ
బుడగలమ్మే అబ్బాయి



మహాకావ్యాన్ని
మించిన ఆనందమిచ్చాయి
పాపాయి తొలిపలుకులు

మా ఆవిడ వొళ్లో
నా బాల్యమై
మా బాబు

**శింగులూరి హరనాథ్**

నేను మాత్రం ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాను. నా మూడ్ గమనించి, "ఏమిటోయ్ ఆలోచన?" అనడిగారు.

"మనుషుల మధ్య ఇంతింత దూరాలు ఏర్పడడానికి అసలు కారణం ఏమిటంటారు?" సాలోచనగా అడిగాను..

"డబ్బు!" అన్నారాయన జేబులోంచి దువ్వెన తీసి పిల్లల తల దువ్వుతూ.

"ఏమిటోనండీ, నాకు చిత్రంగా ఉంటుంది. మళ్లీ అందరూ భక్తులే! అయినా ఎవరిలోనూ ప్రేమతత్వం లేదెందుకో? సున్నితత్వాన్ని కోల్పోయారందరూ."

"ఒకప్పుడు భక్తి మనిషిని, అతని మనసునీ కంట్రోల్ చేసేది. ఇప్పుడు మనుషులే భగవంతుణ్ణీ, భక్తినీ కొనుక్కుంటున్నారు."

"ఎందుకనంటారూ?"

"ఎందుకేమిటి? డబ్బుంటే కొండమీది దేవుడైనా దిగి వస్తాడు!"

"మనసులోని ఈర్ష్యా అసూయలు, కోపతాపాలు అదుపులో పెట్టుకోవడమే కదా భక్తికి పరమార్థం!" అసహనంగా అడిగాను.

"భక్తికీ వాటికీ ముడిపెట్టకు. నేటి దారి వాటిదే! పూర్వం భక్తి మానవుల సహజసిద్ధమైన అవగుణాలను వదిలించి వారి మానసిక పరివర్తనకు కారణభూతమయ్యేది. ఆ భక్తి ఆధ్యాత్మిక విజ్ఞానానికీ, వైరాగ్యానికీ మచ్చుతునకగా ఉండేది. ఆ భక్తులు మానవుల మధ్య ప్రేమానుబంధాలను పెంచుతూండేవారు. ఇప్పుడు భక్తి ఒక లేటెస్ట్ ఫాషన్! కోట్లు సంపాదించి జాగ్రత్తగా దాచుకుని ఆనక ఈ వేషం మొదలుపెడతారు. 'ఇన్నికోట్లు సంపాదించాం కానీ, మాకు వాటిపై ఆశ లేదు. మేం చాలా గొప్ప భక్తులం. ఫలానా స్వామి ఆశ్రమానికి వెళ్తున్నాం. అక్కడికి పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, విదేశీయులూ వస్తూంటారు!' అని చెప్పుకుని సంబరపడిపోతుంటారు."

"మరి వాళ్లలో భక్తి భావం ..." అనుమానం తీరక అడిగాను.

"నేతి బీరకాయలో నెయ్యి!"

"వాళ్లకి అంతరాత్మ ఉండదా? అసలిక్కడికి ఎందుకు వస్తున్నాం అని అనుకోరా? అంతరాత్మ వాటిని పాటించమని ఘోషించదా?"

"ఆనవాలు లేకుండా దాన్నెప్పుడో చంపి పాతేసి ఉంటారు!"

నేనింకా ఏదో అసందిగ్ధభావంతో కొట్టాడుతున్నాను. నా బాధను ఎలా వ్యక్తపరచాలో తెలియక మాటలకోసం తడుముకుంటూ ఆయనవైపు చూశాను.

"నేను చెప్పేది విను, శశీ! ఈ రోజుల్లో భక్తి ఒక ఏసి బాక్స్‌లా, విదేశీ కారులా, విదేశీ బాంక్ అకౌంట్‌లా స్టేటస్ సింబల్ మాత్రమే! అందుకే ఈ భక్తికి నువ్వూహించే ఫలితాలుండవు. వీరి చేతుల్లో దేవుడు ఒక షోకేస్‌లో ఉంటూ అందరికీ ఆనందం కలిగించే ఖరీదైన బొమ్మ!"

నా సందేహాలన్నీ పటాపంచలు కాగా మనసు తేలికపడింది. ■

